ఆధ్యాత్మిక శోభ

● వైభవంగా శ్రావణ శుక్రవారం ● వాడవాడలా వరలక్ష్మీ వ్రతాలు



చీపురుపల్లి: నిమ్మకాయల అలంకరణలో కనకమహాలక్ష్మి



జామి: వాసవీమాతకు తమలపాకులతో అలంకరణ



రామతీర్థంలో పసుపు కొమ్ములతో అమ్మవారు




విజయనగరం: వంద కిలోల పసుపుకొమ్ములతో సంతోషిమాతకు అర్చన

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ నెల్లిమర్ల/ చీపురుపల్లి, ఆగస్టు 30

జిల్లా వ్యాప్తంగా శ్రావణమాసం నాలుగో శుక్రవారం వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. మహిళలు అధిక సంఖ్యలో ఇళ్లల్లో వ్రతాలు చేశారు. ఆలయాల్లో సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. విజయనగరంలోని పైడిమాంబ చదురుగుడి, వనంగుడిలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నగరంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలోనూ వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. మయూరి కూడలి వద్దనున్న సంతోషిమాత ఆలయం వద్ద భక్తుల కోలాహలం కన్పించింది. అమ్మవారికి 100 కిలోల పసుపుకొమ్ములతో అర్చన చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో శ్రావణ మాస నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ పూజలు జరిగాయి. నెల్లిమర్ల ఏడో వార్డు కౌన్సిలర్ ఖైపాడ ప్రసాదరావు, మహేశ్వరి దంపతులు హాజరయ్యారు. చీపురుపల్లిలో కనకమహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆరవెల్లి రవికుమార్, ఈవో జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిటికీ బ్రేకులే



రామన్నవలస సమీపంలో ఎంఐజీ లేఅవుట్ కోసం పరిశీలించిన భూమి

● బుడాలో ఆరంభించి ఆగిపోయిన ప్రాజెక్టులే అధికం

● ఎంఐజీ లేఅవుట్ ఏర్పాటుకు ఏడాదిన్నరగా కలగని మోక్షం

● పార్వతీపురం ప్రాజెక్టు మళ్లీ వెనక్కి

● బొబ్బిలి బ్యూటిఫికేషన్ పనులదీ అదే దుస్థితి

బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా)లో జరిగిన పనుల కన్నా ఆగిపోయిన పనులే అధికంగా ఉన్నాయి. ఏ పని ప్రారంభించినా ఏదో ఒక ఆటంకంతో మధ్యలో ఆగిపోతున్నాయి. మధ్యతరగతి ఆదాయ వర్గాల వారికి (ఎంఐజీ) లేఅవుట్ ద్వారా ఇళ్ల స్థలాల విక్రయానికి చేస్తున్న ప్రయత్నాలు అభాసుపాలవుతున్నాయి. నెలలుగా కొలిక్కిరావడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెట్రోల్ బంకుల ఏర్పాటు, సుందరీకరణ పనులు, స్టేడియం నిర్మాణం ఇలా అన్నీ ఆగిపోయాయి. అసలు వాటికి కదలిక వస్తుందా అని సగటు బొబ్బిలి వాసి సందేహం వ్యక్తం చేస్తున్నాడు.

బొబ్బిలి, ఆగస్టు 30: మధ్యతరగతి ఆదాయ వర్గాల వారికి బుడా ఆధ్వర్యంలో లేఅవుట్(ఎంఐజీ) ద్వారా ఇళ్ల స్థలాల విక్రయానికి నెలలుగా ప్రయత్నిస్తున్నా ప్రాజెక్టు పట్టాలెక్కడం లేదు. భూ సేకరణ ప్రక్రియలోనే ఉండిపోతోంది. ఏడాదిన్నరగా ఏ ప్రయత్నమూ ఫలితాన్ని ఇవ్వలేదు. తొలుత స్థానిక గ్రోత్‌సెంటర్‌లో గుర్తించిన 50 ఎకరాలకు సాంకేతికపరమైన సమస్యలు తలెత్తాయి. ఆ తర్వాత మున్సిపాలిటీ పరిధిలోని రామన్నదొర వలస సమీపంలో గతంలో ఇళ్ల కాలనీ కోసం గుర్తించిన భూమిని పరిశీలించారు. కోర్టు కేసు ఉండడంతో కాలనీ నిర్మాణం జరగలేదు. ఎంఐజీ లేఅవుట్ కోసం ప్రతిపాదించినా అటువైపు దృష్టి పెట్టలేదు. ఈ లోగా డొంగురువలస గ్రామ సమీపంలో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ భూమి కూడా కోర్టు కేసులో ఉండడంతో ఇంకో దగ్గిరి భూసేకరణ కోసం కసరత్తు చేశారు. రంగరాయపురంలో పదెకరాల అసైన్డ్ భూములను కూడా పరిశీలించారు. ఈలోగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో బొబ్బిలి ఎంఐజీ లేఅవుట్ ప్రతిపాదన అటకెక్కిపోయింది.

● బుడా పరిధిలో ఆదాయవనరులను పెంచుకునేందుకు షాపింగ్ కాంప్లెక్స్‌లు, ప్రైవేట్ లేఅవుట్ల అభివృద్ధి, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి కార్యకలాపాలు చేపట్టాల ని నిర్ణయించారు. వాటికి కూడా ఇంతవరకు ఎటువంటి అడుగు పడ లేదు. స్థానిక ప్రేమనగర్ సమీపంలో 50 సెంట్ల ప్రభుత్వ భూమిని పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులు బుడాకు ఇచ్చేందుకు సమ్మతించారు. అయితే ఆ భూమిని గతంలో ప్రేమసమాజం కాలనీవాసు లకు ఇచ్చినందున అది వారికే చెందాలని మున్సిపల్ కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో పెట్రోల్ బంకు ఏర్పాటు ప్రతిపాదనకు బ్రేక్ పడింది.

● బొబ్బిలి పట్టణంలోని పలు ప్రాంతాలలో సుందరీకరణ కోసం, అర్ధాంతరంగా నిలిచిపోయిన స్టేడియం నిర్మాణం కోసం బుడా నుంచి కోటి పదిలక్షల రూపాయలను కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎటువంటి చెల్లింపులు జరపరాదని ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో ఆ ప్రణాళికా తాత్కాలికంగా ఆగిపోయింది.

● పార్వతీపురం పరిధిలో అడ్డాపుశీల కొండప్రాంతంలో 23 ఎకరాల భూమిని ఎంఐజీ లేఅవుట్ కోసం ఎంపిక చేసినా ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేదని ఆ ప్రాజెక్టును తిరస్కరించారు.

● సాలూరు పరిధిలో 15 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్‌ను ఏర్పాటు చేసి అందులో 20 మంది లబ్ధిదారు లకు డ్రా ద్వారా స్థలాలను కేటాయించారు. మరో 20 మందికి డ్రా తీసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఆ లేఅవుట్‌లో మౌలిక వసతులను కల్పించేందుకు రూ.5 కోట్లతో మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు.



ఎంఐజీ లేఅవుట్‌కు స్థలాలు సేకరిస్తాం

బొబ్బిలి ఎంఐజీ లేఅవుట్‌కు ప్రతిపాదించిన భూములను బుడా వైస్‌చైర్మన్‌గా ఉన్న జేసీ చూసిన తరువాత కొత్త ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతాం. పూర్తి స్థాయి నిర్ణయాధికారం ఆయనకే ఉంది. దీనిపై త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తాం. స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో స్థలాలు సేకరిస్తాం. సాలూరు, పార్వతీపురంలోనూ లేఅవుట్లు వేస్తాం.

- దేవకుమార్, ఇన్‌చార్జి పీవో, బుడా

6 గంటలూ టెన్షనే



రిజర్వాయర్‌లో చిక్కుకున్న మత్స్యకారులు

ఎప్పటిలాగే నాటు పడవలతో రిజర్వాయర్‌లోకి చేపల వేటకు వెళ్లారు. ముందురోజు వేసిన వలలను తీసేందుకు ప్రయత్నించారు. ఎంతకీ రాకపోగా పడవలు కూడా ముందుకు కదలలేదు. చుట్టూ గుర్రపుడెక్క అడ్డుగా ఉండిపోవడంతో కదిలే అవకాశం లేకపోయింది. ఊహించని పరిస్థితి ఎదురవ్వడం.. మరోవైపు గుర్రపుడెక్కపై నుంచి క్రిమికీటకాలు రావడంతో ఎలా బయటపడాలో తెలియక టెన్షన్ పడ్డారు. దాదాపు 6 గంటల పాటు ఆందోళన చెందారు. పరిస్థితి తెలుసుకున్న అధికారులు గుర్రపుడెక్కను బయటకు పంపే చర్యలు చేపట్టాక వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో వంగర మండలం మగ్గూరుకు చెందిన మత్స్యకారులు శ్రీను, రాజు, చిన్న, పోలి కొన్ని గంటల పాటు నరకయాతన పడ్డారు.

● మడ్డువలస రిజర్వాయర్‌లో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులు

● పడవలను కదలనీయని గుర్రపుడెక్క

వంగర, ఆగస్టు 30 మగ్గూరుకు చెందిన పూరిమళ్ల శ్రీను, రాజు, చిన్న, పోలి గురువారం సాయంత్రం మడ్డువలస రిజర్వాయర్ పరిధిలోని వెంకమ్మచెరువు ప్రాంతంలో చేపలవేటకు వలలు పన్నారు. రాత్రి ఇంటికి చేరాక తిరిగి వలలు తీసేందుకు శుక్రవారం వేకువజామున నాటు పడవలతో వెళ్లారు. వలలు పైకి ఎత్తేందుకు ప్రయత్నించగా ఎంతకీ రాలేదు. అదే సమయంలో గుర్రపుడెక్క చుట్టూ ఉండడంతో పడవలు కూడా కదలలేదు. బయటకు రావడానికి వీలు లేక నిస్సహాయ స్థితిలో బిక్కుబిక్కుమంటూ ఉండిపోయారు. మరోవైపు గుర్రపుడెక్క పైనుంచి క్రిమికీటకాలు తిరుగుతుండడంతో భయపడ్డారు. వారిలో ఒకరి వద్ద ఫోన్ ఉండడంతో సెల్ఫీతీసి పంపుతూ బంధువులకు పరిస్థితిని తెలిపారు. కుటుంబ సభ్యులు అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన వచ్చిన ఏఈ నితిన్ రెండు ప్రధాన గేట్లు ఎత్తి కొంతమేర గుర్రపుడెక్క బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికి మత్స్యకారులు మెల్లమెల్లగా పడవలను కదుపుతూ ఒడ్డుకు చేరారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



మడ్డువలస జలాశయం ప్రధాన గేటు నుంచి గుర్రపుడెక్కను బయటకు పంపుతున్న దృశ్యం

● మడ్డువలసకు వచ్చిన నాయకులు, ఆధికారులకు గుర్రపుడెక్క ప్రమాదమని, పూర్తిస్థాయిలో తొలగించే చర్యలు తీసుకోవాలని అనేకసార్లు స్థానికులు కోరినా పట్టించుకోలేదు. గతంలో పటువర్ధనం, కొట్టిశ, దేవకివాడ తదితర ప్రాంతాల్లో గుర్రపుడెక్కలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా తొలగించే చర్యలు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

బదిలీలకు 15 వరకూ గడువు పెంపు

● ఇప్పటికే కొన్ని శాఖల్లో బదిలీలు పూర్తి

● మిగిలిన వారికి దశల వారీగా ప్రక్రియ

కలెక్టరేట్, ఆగస్టు 30: ఉద్యోగుల సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 15 వరకూ ప్రభుత్వం గడువు పెంచింది. తొలుత ఈనెల 31లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఈనెల31న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఉన్న సచివాలయం ఉద్యోగులకు మినహా మిగిలిన వారికి యథావిధిగా బదిలీలు పూర్తి చేయాలంటూ గురువారం రాత్రి ప్రభుత్వం జీవో 83 జారీ చేసింది. అంతలోనే నిర్ణయం మార్చుకుని అన్ని శాఖల ఉద్యోగుల బదిలీల గడువు వచ్చే నెల 15వరకూ పెంచుతూ శనివారం ఉదయం మరో జీవో జారీ చేసింది. కాగా గ్రామవార్డు సచివాలయ పరిధిలో పనిచేసే ఇంజినీరింగ్, గ్రామ రెవెన్యూ కార్యదర్శులు తప్పా మిగిలిన వారికి బదిలీలు నిర్వహించారు. వీరికి పింఛన్ల ప్రక్రియ పూర్తి అయిన తరువాత సెప్టెంబరు 3న బదిలీల ఆర్డర్లు అందజేస్తారు. జిల్లాలో రెవెన్యూ శాఖలో పని చేస్తున్న వీఆర్‌వో నుంచి తహసీల్దార్ల వరకూ బదిలీల కోసం ఇప్పటి వరకూ సుమారు 200 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. అంతా సిద్ధం చేసిన సమయంలో మరో 15 రోజులు పాటు గడువు పెంచడం వల్ల ఉద్యోగుల్లో వేడి కాస్త తగ్గింది.

ప్రధానంగా గ్రామ స్థాయిలో పని చేస్తున్న రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులు తమకు కావాల్సిన చోటు కోసం ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. వారి సిఫార్సు లేఖల కోసం స్థానిక నాయుకులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్నారు. సచివాలయం సిబ్బంది కూడా లేఖల కోసం ప్రదక్షిణ చేస్తున్నారు. ఇరిగేషన్‌శాఖలో పనిచేస్తున్న జేఈలు కూడా ఇదే తరహాలో ప్రజా ప్రతినిధుల సిఫార్సుల కోసం క్యూ కడుతున్నారు. అలాగే ప్రజా ప్రతినిధులు కూడా వారికి కావాల్సిన ఉద్యోగులకు లేఖలు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

పచ్చదనాన్ని పెంచుదాం

● వన మహోత్సవంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

డెంకాడ, ఆగస్టు 30: జిల్లాలో పచ్చదనాన్ని పెంచుదామని, మొక్కలు నాటే కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగాలని మంత్రి శ్రీనివాస్ సూచించారు. డెంకాడ మండలం పెదతాడివాడ పంచాయతీ పరిధిలోని బేతనాపల్లి నగరవనంలో అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ జిల్లాలో అటవీ విస్తీర్ణం అతి తక్కువగా 6 శాతం మాత్రమే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం 50శాతం పచ్చదనం తీసుకురావాలంటే జిల్లాలో ప్రతీరోజు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ స్థలాలకే పరిమితం చేయకుండా ఇళ్ల కాలనీలు, ఖాళీ స్థలాలు ఇళ్ల వద్ద కూడా మొక్కలు నాటడం ద్వారా సామాజిక అటవీ విస్తీర్ణం పెంచుకోవాల్సి ఉందన్నారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో ఏటా జిల్లాలో కనీసం 2 నుంచి 3శాతం పచ్చదనాన్ని పెంచేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని చేరుకునేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు తదితరులు వేప, నేరేడు, మామిడి, మద్ది కానుగ తదితర రకాల మొక్కలు నాటారు. కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ, తాటిచెట్ల వల్ల పిడుగుల బారి నుండి ప్రజల ప్రాణాలను కాపాడుకోవచ్చని, వాటిని తొలగించకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. ఈ మేరకు అన్ని మండలాల తహసీల్దార్లకు ఆదేశాల జారీ చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి జమదగ్ని, డెంకాడ ఎంపీడీవో డీడీ స్వరూపరాణి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే తదితరులు

ముందే పింఛన్

● నేడే సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటిన ఇవ్వాల్సిన పింఛన్ ఈ నెలలోనే అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒకటో తేదీ ఆదివారం కావడంతో రెండో తేదీన ఇవ్వాలని తొలుత భావించింది. కానీ పింఛనుదారులు ఇబ్బంది పడతారన్న ఉద్దేశంతో ఒకరోజు ముందుగానే పింఛన్‌ను వారి చెంతకు చేరుస్తోంది. గత ప్రభుత్వంలో ఒకటో తేదీ సెలవు రోజు పడితే మరుసటి రోజే ఇచ్చేవారు. మూడు లేదా నాలుగు రోజులు సెలవులున్నా ఆ తర్వాతే అందించేవారు. కూటమి ప్రభుత్వం అలా కాకుండా పేదలకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతో ఈ నెల 31న పంపిణీ చేపట్టనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్ని జిల్లాల కలెక్టర్లకు ముందుగానే స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. శనివారం శతశాతం అందించేందుకు ప్రయత్నించాలని ఆదేశించారు. వివిధ కారణాలతో అందకపోయిన వారికి సెప్టెంబరు 2 సోమవారం అందించాలని సూచించారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను పూర్తిచేసింది. సచివాలయ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ శాఖల సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

రూ.116.31 కోట్లు మంజూరు

జిల్లాలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కళాకారులు, దీర్ఘకాలిక రోగులు..తదితర 14 విభాగాలకు చెందిన 2,79,336 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికోసం రూ.116.31 కోట్లు మంజూరయ్యాయి. శుక్రవారం సాయంత్రమే సచివాలయ ఉద్యోగులు బ్యాంకుల నుంచి నగదు డ్రా చేశారు. గత రెండు నెలల అనుభవాల నేపథ్యంలో తొలిరోజే 95 శాతానికిపైగా పింఛన్ల పంపిణీ పూర్తిచేస్తామని యంత్రాంగం చెబుతోంది. పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను సైతం నియమించింది.

తెల్లవారుజాము నుంచే పంపిణీ

ఈ నెల 31న తెల్లవారుజాము నుంచే జిల్లా వ్యాప్తంగా పింఛను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. ఇందుకు అవసరమైన నగదును శుక్రవారం నాడే ఆయా బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేశాం. పెన్షన్ల పంపిణీ విధుల్లో 5,339 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉంటారు. ఉదయం 10 గంటలకే శతశాతం పంపిణీ చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించాం.

- అంబేడ్కర్, కలెక్టర్

మిలిటరీ స్కూళ్లలో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలు



దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు, వాటి వివరాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్), బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక). రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, ఇతర వర్గాల పౌరుల పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలు.

- రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) 2025-26

అర్హతలు: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

▼ 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 2010 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2012 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్: రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరుల పిల్లలకు మాత్రమే కేటాయించారు.

ఎంపిక ప్రక్రియ: రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: పరీక్షలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పరీక్ష సబ్జెక్టులు

6వ తరగతి: ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మేథ్స్(50 మార్కులు), ఇంగ్లీష్(50 మార్కులు). 5వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు.

9వ తరగతి: ఇంగ్లీష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మేథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు). 8వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: www.rashtriyamilitaryschools.edu.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/nuz8UXzలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏపీ పీజీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు.



కోర్సులు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ:** ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కూచిపూడి క్లాసికల్ డ్యాన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్, యోగా, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, ఎకనామిక్స్, మేథమెటిక్స్
- **ఎంఎఫ్ఏ:** స్కల్ప్చర్, పెయింటింగ్, ప్రింట్ మేకింగ్
- మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఆర్ఎం)
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ)
- మాస్టర్ ఆఫ్ కామర్స్(ఎంకాం)
- మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎంపీఈడీ)

ఎమ్మెస్సీ: బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీస్, కోస్టల్ ఆక్వా కల్చర్ అండ్ మెరైన్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హోమ్ సైన్స్(ఫుడ్, న్యూట్రిషన్, డైటెటిక్స్), బోటనీ, జువాలజీ, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, మెరైన్ జియోఫిజిక్స్, జియోఫిజిక్స్, ఫిజికల్ ఓషనోగ్రఫీ, మెటరాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఫుడ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, అప్లయిడ్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 5
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో
బీవీఎస్సీ & ఏహెచ్

ఐకార్ ఆధ్వర్యంలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ)- బీవీఎస్సీ & ఏహెచ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులోనే ఏడాది పాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 45 రెగ్యులర్ సీట్లు, 8 పేమెంట్ సీట్లు(సూపర్ న్యూమరరీ) ఉన్నాయి. వీటిని నీట్ యూజీ 2024 ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎన్ఆర్ఐ కోటా కింద రెండు సీట్లు(సూపర్ న్యూమరరీ) ప్రత్యేకించారు. వీటిని అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన అయిదు సీట్లను రోస్టర్ విధానంలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భర్తీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. నీట్ యూజీ 2024 అర్హత పొందాలి. ఇందులో నిర్దేశించిన కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 18
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 26
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 27
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7
- **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** ivri.nic.in

నవ్య | చిత్రజ్యోతి

ఇక్కడ కూడా అలాంటి కమిటీ వేయాలి

మాలీవుడ్‌లో కొనసాగుతున్న కీచకుల అకృత్యాలను బయట పెట్టిన జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌ను హీరోయిన్ సమంత స్వాగతించిన విషయం తెలిసిందే. తెలుగు చిత్ర పరిశ్రమలోని లైంగిక వేధింపులపై తెలంగాణ ప్రభుత్వం కూడా దృష్టి సారించాలనీ, జస్టిస్ హేమ కమిటీ తరహాలో ఇక్కడ కూడా ఓ కమిటీ వేయాలని సమంత కోరారు. వేధింపులకు గురికాకుండా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం అప్పుడే మహిళా ఆర్టిస్టులకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.



'తెలుగు చిత్రపరిశ్రమలో మహిళలుగా మేమంతా జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌కు స్వాగతం పలుకుతున్నాం. అలాగే కీచకులపై పోరాటం చేస్తున్న డబ్ల్యూసీసీ చర్యలను అభినందిస్తున్నాం. మాలీవుడ్‌లో మహిళల హక్కుల కోసం డబ్ల్యూసీసీ విజయవంతమైన పోరాటం చేసింది' అని సమంత అన్నారు.

బాలకృష్ణ స్వర్ణోత్సవ సభకు అతిరథమహారథులు



నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. సెప్టెంబర్ ఒకటిన నోవాటెల్ హోటల్‌లో ఈ వేడుకలకు అతిరథమహారథులు హాజరవుతున్నారు. ఇప్పటికే ఎంతో మందికి ఆహ్వానాన్ని అందించారు. ఇంకా కొంతమందికి పిలుపులు వెళ్లలేదని వస్తున్న వార్తలపై శుక్రవారం సాయంత్రం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి క్లారిటీ ఇచ్చింది. కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'తెలుగు చిత్రపరిశ్రమలోని అన్ని శాఖలు కలసి ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల మంత్రులు, కేంద్రమంత్రులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారు. ఇతర భాషల సినీ ప్రముఖులు కూడా వస్తారు. ఫిజికల్‌గా ఎవరికైనా ఇన్విటేషన్ అందకపోయినా ఇదే మా వ్యక్తిగత ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలి' అని కోరారు. ఈ కార్యక్రమంలో చదలవాడ శ్రీనివాసరావు, సి.కల్యాణ్, మాదాల రవి, భరత్‌భూషణ్, ప్రసన్నకుమార్, శివబాలాజీ, పరుచూరి గోపాలకృష్ణ, అశోక్‌కుమార్, మాధవపెద్ది సురేశ్, అనిల్‌కుమార్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి సినిమాలో నటిస్తున్నా



● చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

మెగాస్టార్ చిరంజీవితో కలసి సినిమాలో నటించే అవకాశం లభించనుందని కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవికి తాను పెద్ద అభిమానినని అన్నారు. ఆయనకు తనపై ప్రేమ ఉందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు హైదరాబాద్‌లోని ఇంటికి పిలిపించి సన్మానం చేశారని అన్నారు. పవన్ కల్యాణ్ గెలిచినప్పుడు తాను ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపానని అన్నారు. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమా చేస్తున్నారని, అది ముగిశాక ప్రారంభమయ్యే మరో సినిమాలో తాను నటిస్తానని తెలిపారు. తన పాత్ర ఏమిటనేది భవిష్యత్తులో తెలుస్తుందని అన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

శ్రీరంగపురంలో కల్యాణం



వనపర్తి జిల్లా శ్రీరంగపురంలోని రంగనాథ స్వామి ఆలయం మా కుటుంబానికి చాలా ప్రత్యేకం. సిద్ధార్థ్‌తో నా నిశ్చితార్థం అక్కడే జరిగింది. త్వరలో మా పెళ్లి కూడా అక్కడే జరుగుతుంది' అని కథానాయిక అదితీ రావ్ హైదరీ చెప్పారు. మార్చిలో వారిద్దరికీ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. తమ ప్రేమ, పెళ్లి గురించి అదితీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పెళ్లి తేదీని పెద్దలు నిర్ణయిస్తారు, మేం ఇద్దరం కలసి ప్రకటిస్తామని చెప్పారు. 'మహాసముద్రం' సినిమా చిత్రీకరణ సమయంలో సిద్ధార్థ్, అదితీ ప్రేమలో పడ్డారు.

అవసరమైతే కోర్టుకు వెళ్తా



బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదల ముంగిట వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాను నిషేధించాలంటూ పలు సిక్కు సంఘాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన అత్యయిక పరిస్థితి ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిది. ఇందిరా గాంధీ పాత్రను పోషించడంతో పాటు కంగనే ఈచిత్రానికి దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 06న 'ఎమర్జెన్సీ'ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు కంగన సన్నాహాలు చేశారు. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల సందిగ్ధంలో పడింది. తమ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కంగన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సినిమాను విడుదల చేసేందుకు అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని ఆమె చెప్పారు. సినిమాలను విడుదల చేస్తే చంపేస్తామంటూ వస్తున్న బెదిరింపుల గురించి మాట్లాడుతూ 'నన్ను భయపెట్టాలని చూసినంత మాత్రాన చరిత్ర మారిపోదు కదా' అని కంగన అన్నారు. సంజయ్ గాంధీ పాత్ర పోషించిన విశాక్ నాయర్‌కు సైతం బెదిరింపులు వచ్చాయి.



ఇటీవల కర్నాటకలోని కూర్గ్‌లో వివాహం చేసుకుని ఒక్కటైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్ రిసెప్షన్ శుక్రవారంహైదరాబాద్‌లో జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.



అభిమానుల ప్రేమలో తడిసి ముద్దయ్యారు హాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఏంజెలీనా జోలీ. వెనిస్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఆమె నటించిన 'మరియ' చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. షో పూర్తవ్వగానే అందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో ఆమె నటనను అభినందించారు. దాదాపు ఎనిమిది నిమిషాల పాటు థియేటర్ అంతా మార్మోగింది. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమతో ఉద్వేగానికి లోనైన ఏంజెలీనా కన్నీళ్లను ఆపలేకపోయారు. సహనటుడు ఫియర్స్ ఫావినో ఆమెను సముదాయించారు. అభిమానులకు ఏంజెలీనా ధన్యవాదాలు తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఎన్నో కష్టాలు అనుభవించి ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు అని అభిమానులు ఏంజెలినాను ప్రశంసిస్తున్నారు.

అభిమానుల ప్రేమకు ఆనంద భాష్పాలు

టీవీ రంగంలోనూ లైంగిక వేధింపులు

● సీనియర్ నటి కుట్టిపద్మిని



తమిళ చిత్రసీమతోపాటు టీవీ రంగంలోనూ మహిళలపై లైంగిక వేధింపులకు కొదువలేదని సీనియర్ నటి కుట్టిపద్మిని ఆరోపించారు. ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సినిమాల్లోనే కాదు టీవీ సీరియల్స్‌లో నటించే యువతులు కూడా లైంగిక వేధింపులకు గురవడం సహజంగా మారిపోయింది. అలా వేధింపులకు గురయ్యేవారు సమాజానికి భయపడి ఎవరికీ ఫిర్యాదు చేయడం లేదు. పారితోషికాలు పెద్ద మొత్తంలో లభిస్తుండటంతో కొంతమంది ఈ లైంగిక వేధింపులను భరిస్తున్నారు. ఫిర్యాదు చేసేవారికి మళ్లీ సినిమాల్లో నటించే అవకాశాలు లభించడం లేదు. నటుడు సురేశ్ గోపీపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఎక్కడున్నాయంటూ కొంతమంది అడుగుతున్నారు, ఆధారాలు ఎవరిస్తారు?' అని ఆమె ప్రశ్నించారు. దీనికి సీబీఐ విచారణ లాగా లై డిటెక్టర్లతో పరీక్షల చేయడం మినహా మరో మార్గం లేదన్నారు. దర్శకులు, సాంకేతిక నిపుణుల నుండి మహిళలు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారని, అవి భరించలేక ఎంతోమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని కుట్టి పద్మిని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నా



తెలుగు సినిమాల్లో తండ్రి పాత్రలు దాదాపు ఒకేలా ఉంటున్నాయి. అయినా తనకు ఇచ్చిన పాత్రల్లో వైవిధ్యం చూపించడానికి కృషి చేస్తున్నారు నటుడు ఆనంద చక్రపాణి. 'దాసి' చిత్రంతో తొలిసారిగా తెరపై కనిపించి లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ 'మల్లేశం' సినిమాలో తండ్రి పాత్రతో ఎంట్రీ ఇచ్చారు. ఒకే ఒక్క చాన్స్ జీవితాన్ని మలుపు తిప్పుతుందని చాలా సందర్భాల్లో నిజమైన విషయం. అలాగే 'మల్లేశం' చిత్రం ఆనంద చక్రపాణి కెరీర్‌ని మలుపు తిప్పింది. ఇప్పటికి 45పైగా చిత్రాల్లో నటించేలా చేసింది.. అవన్నీ విభిన్న పాత్రలు కావడం తన అదృష్టం అంటూ ఆనంద చక్రపాణి చెప్పిన విశేషాలు ఇవి.

- చిన్నప్పటి నుంచి నాకు నటన అంటే ఇష్టం. మంచి నటుడుగా పేరు తెచ్చుకోవాలనే కోరిక ఉండేది. మంచి బ్రేక్ కోసం ఎదురు చూశాను. అది 'మల్లేశం' రూపంలో వచ్చింది. ఇప్పటివరకూ చాలా సినిమాలు చేశాను. ఒక పెద్ద హిట్ పడితే అందరి దృష్టిలో పడతాను. 'రాజు యాదవ్' చిత్రంలో నా పాత్రకు మంచి పేరు వచ్చింది. సినిమా తేడాగా ఉండడంతో ఆడలేదు. ఒక్కోసారి మనం ఎంత బాగా చేసినా సినిమా ఆడకపోతే ప్రయోజనం ఉండదు కదా 'మల్లేశం' స్థాయి పాత్ర నాకు మళ్లీ 'అనగనగా ఒక అతిథి' సిరీస్‌లో వచ్చింది. అందులో నాలుగే నాలుగు పాత్రలు. అందులో తండ్రి పాత్ర కూడా నాకు మంచి పేరు తెచ్చింది.
- ఇంతకుముందు అడ్వర్‌టైజ్‌మెంట్ రంగంలో ఉన్నాను. యాడ్ ఫిల్మ్స్ డైరెక్ట్ చేశాను. ఇప్పుడు మాత్రం నటన మీదే దృష్టి పెట్టాను. నాకు ఇచ్చిన పాత్రకు పూర్తి న్యాయం చేకూర్చడానికి చాలా హోమ్ వర్క్ చేస్తుంటాను. ఆ పాత్రలో ప్రవేశించడానికి మానసికంగా స్ట్రగుల్ అవుతాను. అందరూ అలాగే చేస్తుంటారు కానీ నాకు కూడా ఆ గుణం ఉంది. అందుకేనేమో ఎమోషనల్ ఫాదర్ వేషం అంటే నాకే పిలుపు వస్తుంది.
- పాత రోజుల్లో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన చిత్రాలన్నీ వదిలిపెట్టకుండా చూసేవాణ్ణి. ఆర్ట్ ఫిల్మ్స్‌తోనే నా నడక మొదలైంది కనుక ఆ తరహా చిత్రాలంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లో షబానా అజ్మీ, నజీరుద్దీన్ షా, ఓంపురి, స్మితాపాటిల్ నటించిన సినిమాలు ఎక్కువగా వచ్చేవి. ఆ చిత్రాల ప్రభావం నా మీద బాగా ఉండేది. ఈమధ్య కాలంలో నవాజుద్దీన్, ఇర్ఫాన్ ఖాన్ వంటి నాచురల్ ఆర్టిస్టులు ఎంతో అద్భుతంగా నటిస్తున్నారు. పాత్రలో రాణించడానికి చాలా హోమ్ వర్క్ చేస్తారు. అవన్నీ చూసి ప్రేరణ పొంది, నాచురల్‌గా నటించడానికి కృషి చేస్తున్నాను. మెలో డ్రామా నాకు నచ్చదు.
- ప్రస్తుతం నాలుగు చిత్రాలు షూటింగ్ దశలో, మరో రెండు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ'లో మంచి పాత్ర చేస్తున్నాను. అలాగే పర్యావరణం మీద చేస్తున్న 'గాంధీతాత జట్టు' కూడా నాకు మంచి పేరు తెస్తుందనే ఆశతో ఉన్నా.

ఇన్ ప్రోగ్రెస్

డబుల్ ఫన్..థ్రిల్



విజయం సాధించిన 'మత్తు వదలరా' చిత్రానికి సీక్వెల్‌గా 'మత్తు వదలరా 2' వస్తోంది. శ్రీసింహా కోడూరి లీడ్ రోల్‌లో, సత్య సైడ్ కిక్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకుడు. మైత్రీ మూవీస్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా, సునీల్, అజయ్, రోహిణి ఇతర ముఖ్య పాత్రధారులు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అనంతరం హీరో శ్రీసింహా మాట్లాడుతూ 'డబుల్ ఫన్, థ్రిల్ ఉండేలా సెకండ్ పార్ట్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదలవుతుంది' అని చెప్పారు. ఫస్ట్ పార్ట్‌లోనే ఒక ఐడియాను ప్లాంట్ చేసి దాని నుంచి డైరెక్ట్‌గా సీక్వెల్ చేశామని దర్శకుడు చెప్పారు.

కోర్టు రూమ్ డ్రామా



త్రిగుణ్ ప్రధాన పాత్ర పోషించిన 'ఉద్వేగం' చిత్రం టీజర్‌ను రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో లుకలపు మధు నిర్మించారు. 'కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులో చాలా తక్కువ చిత్రాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చూసిన తర్వాత సిన్సియర్ ఎఫర్ట్ అనీ, అందరూ సహజంగా నటించారనీ అర్థమవుతోంది' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. నటుడు ఆదిత్యకు, త్రిగుణ్‌కు ఇది 25వ చిత్రమనీ, చట్టాన్ని బేస్ చేసుకుని రూపొందించిన ఈ సినిమా విడుదల తేదిని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

పెళ్లి విందులు.. చిందులు



పెళ్లిలో జరిగే విందులు, చిందుల్ని కన్నుల విందుగా చూపిస్తున్న చిత్రం 'లగ్గం'. సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన ఈ చిత్రాన్ని వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. రమేశ్ చెప్పాల దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన హీరో ఆది సాయికుమార్ యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'కథ, కథనం ఈ సినిమాకు బలం. ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలసి చూసేలా సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. కథ నచ్చి ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత తెలిపారు. 'లగ్గం' సినిమా చేయడం తన అదృష్టం అని సాయిరోనక్ చెప్పారు.

డిసెంబర్‌లో విడుదల



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, సూరి ప్రధాన పాత్రలు పోషించిన 'విడుదల 2' చిత్రం రిలీజ్ డేట్ ఖరారైంది. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. గతంలో వచ్చిన 'విడుదల' చిత్రానికి ఇది కొనసాగింపు. గౌతమ్ వాసుదేవ్ మీనన్, అనురాగ్ కశ్యప్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషించారు. ఎల్రెడ్ కుమార్ నిర్మాత. సంగీతం: ఇళయ రాజా, సినిమాటోగ్రఫీ: ఆర్ వేల్రాజ్.

బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి'



ప్రతిష్ఠాత్మక బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి' వెబ్‌సిరీస్ నామినేట్ అయింది. ఉత్తమ ఓటీటీ ఒరిజినల్, ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగాల్లో ఇది నామినేట్ అయింది. బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తన సిరీస్ నామినేట్ అవ్వడం పట్ల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఆనందం వ్యక్తం చేశారు. 'ఈ చిత్రోత్సవాలకు రెండు విభాగాల్లో నామినేట్ అవ్వడం మా టీమ్‌కు గర్వకారణం' అని ఆయన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ సారి ఇండియా నుంచి బూసాన్ చలన చిత్రోత్సవాలకు ఎంపికైన ఏకైక ప్రాజెక్ట్ గా 'హీరామండి' నిలిచింది. మనీషా కొయిరాలా, అదితీరావ్ హైదరీ, సోనాక్షి సిన్హా తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల నిరసన
- సీపీఎస్ రద్దు చేయాలంటూ డిమాండ్

కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న యూపీఎస్ పెన్షన్ విధానం వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన చేపట్టారు. పలు చోట్ల అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. నూతన విధానంతో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూపీఎస్, సీపీఎస్, జీపీఎస్‌ల పెన్షన్ విధానాలు రద్దు చేసి, పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. -(ఆంధ్రజ్యోతి బృందం)


కురుపాంలో..


పాలకొండ: ఆర్డీవో కార్యాలయం వద్ద..


సాలూరు రూరల్: ధర్నా చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు



బెలగాం: తహసీల్దార్ కార్యాలయం వద్ద..


చీపురుపల్లి: ఎమ్మార్సీ ఎదుట..


గజపతినగరం: తహసీల్దార్ కార్యాలయం వద్ద..


ఎస్‌కోట: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ..

నలుగురు ఎస్ఐలకు పోస్టింగ్‌లు

విజయనగరం క్రైం: జిల్లాలోని నలుగురు ఎస్ఐలకు పోలీసుస్టేషన్లను కేటాయిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులను జారీ చేశారు. డీఎస్‌బీలో ఎస్ఐలుగా పనిచేస్తున్న ఎస్.భాస్కరరావుకు ఎస్.కోట పోలీసుస్టేషన్‌కు, ఆర్.నరసింహమూర్తికి రాజాం టౌన్ పీఎస్‌కు, బి.సురేంద్రనాయుడు, వి.లక్ష్మీప్రసన్నకుమార్‌లను విజయనగరం వన్‌టౌన్ పీఎస్‌కు ఎటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నలుగురు ఎస్ఐలను రిలీవ్ చేయాలని డీఎస్‌బీ ఇన్‌స్పెక్టరును జిల్లా ఎస్పీ ఆదేశించారు.

జిల్లాకు ప్రత్యేక అధికారిగా వినయ్ చంద్

కలెక్టరేట్: జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టరు అంబేడ్కర్ తెలిపారు. దీనిలో భాగంగా విజయనగరం జిల్లాకు యువజనాభ్యుదయం పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి వినయ్ చంద్‌ను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ శాఖల అధికారులు, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం చేసి ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యం నేరవేరే విధంగా అమలు చేయడంతో ప్రత్యేక అధికారులు తోడ్పడతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు వెల్లడించారు.

కలసిమెలసి జీవించండి

కొత్తవలస: గ్రామాలలో కుల వివక్ష లేకుండా అందరూ కలసిమెలసి జీవించాలని తహసీల్దార్ నీలకంఠారావు హితవు పలికారు. శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా చిన్నిపాలెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, జాతి వివక్ష లేకుండా అందరూ కలసి మెలసి జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లిని కలిసిన నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు: రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని నగరపాలక సంస్థ కమిషనర్ పి నల్లనయ్య శుక్రవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో మంత్రి శ్రీనివాస్‌ని సత్కరించి, మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనించేందుకు అధికారులు సమష్టి కృషితో సేవలు అందించాలని సూచించారు.

సాహితీవేత్తకు సత్కారం

లక్కవరపుకోట: మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త కిలారి గౌరినాయుడు సాహితీ సత్కారం లభించింది. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి విశాఖట్టణంలో బీవీకే.విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహించిన గిడుగు రామ్మూర్తి 161వ జయంతి ఉత్సవ సందర్భంగా సాహిత్య, సంగీత, సాంస్కృతిక, పరిశోధన, కళా రంగాల్లో కృషి చేస్తున్న గౌరినాయుడును సాహితీవేత్తలంతా సత్కరించారు.

మత్స్యకారులకు శిక్షణ

బొబ్బిలి రూరల్: మండలంలోని కాసిందొరవలస గ్రామంలో శుక్రవారం జాతీయ జల కృషి సుస్థిర కేంద్రం ఆధ్వర్యంలో మత్స్యకార ఎస్టీ రైతులకు ఆక్వా కల్చర్‌లో మెరుగైన నిర్వహణ పద్ధతులు, వైవిధ్యీకరణపై విజయవాడలోని రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్‌కు చెందిన శాస్త్రవేత్త తిలాపియా తీసుకున్న ప్రాక్టికల్ క్లాస్‌తో 5 రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. గ్రామాల్లోని సాగునీటి వనరుల్లో చేపలు, రొయ్యలను సాగు చేస్తున్న మత్స్యకార రైతులకు ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మంచి యాజమాన్య పద్ధతులు ద్వారా చేపలు, రొయ్యలు పెంపకం గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఫీల్డ్ మేనేజర్ రాము ఆధ్వర్యంలో జరిగిన 5వ రోజు ముగింపు కార్యక్రమంలో ఉత్తర ఆంధ్రప్రదేశ్ మత్స్యకార రీజనల్ కోఆర్డినేటర్ ఎస్ బాలాజీ, ఎఫ్‌టిఓ ఎమ్‌పిఈడిఎ ఆర్ సంతోషి పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమం రైతులకు చాలా మేలు చేస్తాయని, చేపలు పెంచడం వలన వారికి ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని తెలియజేశారు. అనంతరం ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు రీజనల్ కోఆర్డినేటర్ ఎన్‌పి చంద్రశేఖరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు, రోజుకి 250 రూ. చొప్పున స్టైఫండ్ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీహెచ్ సంజీవనాయుడు, విలేజ్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే.. డ్రైడే పై అవగాహన

శృంగవరపుకోట: మండలకేంద్రమైన ఎస్.కోట సచివాలయం-1 పరిధిలో వున్న బర్మాకాలనీలో కొట్టాం పిహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానికులకు ఫ్రైడే..డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. శుక్రవారం మలేరియా ఆదికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జ్వరాలకు కారణమైన దోమల సంతతి ఏవిధంగా నివారించాలో వివరించారు.

వాయు కాలుష్యానికి కారణాలను గుర్తించాలి

- కలెక్టరు అంబేడ్కర్

కలెక్టరేట్: నగరంలోని వాయు కాలుష్యం ఎక్కువగా నమోదవుతుందని అందుకు గల మూల కారణాలను కనుగొనాలని కలెక్టర్ అంబేడ్కర్ సూచించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం అమలుపై తమ చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశంలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న నగరాల జాబితాలో విజయనగరం కూడా ఉండటానికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా కేంద్రంలో వాయు కాలుష్యానికి కారణాలను విశ్లేషించి, నియంత్రణకు పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. కాలుష్య కారణాలను గుర్తిస్తే, దాని నివారణ సులువవుతుందని ఈదిశగా ప్రయత్నం చేయాలన్నారు. ముఖ్యంగా వాయు కాలుష్యాన్ని నమోదు చేసే పరికరాల ప్రదేశాలను మార్చి రీడింగ్‌లను నమోదు చేయాలన్నారు. ఈ ఏడాది సుమారు రూ. 2.65 కోట్ల ఖర్చుతో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా విస్తృతంగా మొక్కలను నాటడం ద్వారా కాలుష్యాన్ని చాలా వరకూ అరికట్టవచ్చునన్నారు. విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీని కోసం చార్జింగ్ పాయింట్లు ఎక్కువగా ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో ఉన్న పెట్రోల్ బంకులను తనిఖీ చేయాలన్నారు. పొల్యూషన్ ఇంజినీరు సరిత, వ్యవసాయశాఖ జేడీ రామారావు, ఉద్యాన శాఖ డిడి జమదగ్ని, డీఎస్‌వో మధుసూదనరావు ఉన్నారు.


మాట్లాడుతున్న కలెక్టరు అంబేడ్కర్

- వర్షాకాలం అయినందున ఈ రెండు నెలల పాటు సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. ఆయా శాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు వైద్యాధికారులు గ్రామ స్థాయిలో పరీక్షలు సరిగ్గా జరుగుతున్నది లేనిదీ, మందులకు సక్రంగా అందుతున్నది లేనిది తనిఖీ చేయాలన్నారు. మురుగు కాలువలు ప్రతి రోజు శుభ్రం చేయాలని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, డీపీవో శ్రీధర్ రాజా, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు ఒడిశా నిందితుల అరెస్టు

బొబ్బిలి: గంజాయి కేసులో ఇద్దరు ఒడిశావాసులను శుక్రవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన విషయాలను ఆయన వెల్లడించారు. ఒడిశాలోని పొట్టంగి తాలూకా పనసపాడు గ్రామానికి చెందిన జట్టి సీతారాం, లక్ష్మణరావు అనే ఇద్దరు అన్నదమ్ములు గంజాయితో పట్టుబడ్డారన్నారు. పట్టణంలోని టీబీఆర్ థియేటర్ సమీపంలోని శ్మశానవాటిక దగ్గర అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిరువురిని అదుపులోనికి తీసుకున్నామని, వారి నుంచి 1550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. ● ఈ నెల 16న బొబ్బిలి పట్టణంలోని దావాల వీధికి చెందిన చింతాడ సారధి అనే ప్రధాన నిందితునితో మరో నలుగురు నిందితులను అరెస్టు చేసి 16 కిలోల 595 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సారధిపై అనుమానాస్పద షీటు ఉందని, బొబ్బిలి కేంద్రంగా నేరప్రవృత్తి కలిగిన వారందరినీ కూడగట్టి గంజాయి రవాణా, విక్రయాల వంటి వాటికోసం వినియోగించుకుంటున్నారన్నారు. బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి కూడా ఇందులో ఉన్నాడన్నారు. ఈ కేసులో ముగ్గురు బాలురు కూడా పట్టుబడ్డారన్నారు. చింతాడ సారధి స్వగ్రామం బొబ్బిలి మండలం రాముడువలస అని, అతని నేరాల నేపథ్యంలో గంజాయికి సంబంధించిన మూలాలను చేధించామన్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన ఇద్దరు అన్నదమ్ములు పట్టుబడ్డారన్నారు. బొబ్బిలి డివిజన్‌ను గంజాయి, ఇతర మత్తుపదార్థాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని, ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన నిఘా పెట్టామని డీఎస్పీ తెలిపారు. సీఐ కటకం సతీష్‌కుమార్ పాల్గొన్నారు.


గంజాయికేసులో నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ

ప్లాస్టిక్ టీ కప్పులు వాడొద్దు

- కమిషనర్ నల్లనయ్య డివిజన్ పర్యటన

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 30: ఇక నుంచి టీ దుకాణాల్లో ప్లాస్టిక్ కప్పులు, సింగిల్ యూజ్ కప్పులు వినియోగించరాదని, కేవలం స్టీల్ లేదా గాజుగ్లాసులు మాత్రమే వాడాలని కమిషనర్ నల్లనయ్య సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే, అపరాధ రుసుం విధించాలని అధికారులకు ఆదేశించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం రాజీవ్ స్టేడియం ఎదురుగా వాహన డిపోను సందర్శించారు. చెత్తను తరలించే వాహనాన్ని పరిశీలించి, మరమ్మతులకు గురైన వాహనాలను తక్షణమే సరి చేయించాలని సిబ్బందికి ఆదేశించారు. అక్కడ సీసీ డ్రైన్‌తో పాటు, సిమెంట్ ఫ్లోరింగును ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పాలానుపత్రికి వద్దకు వెళ్లి అక్కడ నెలకొన్న పరిస్థితిని గమనించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యను పరిష్కరించాలి

విజయనగరం దాసన్నపేట: ఆశా వర్కర్ల సమస్యను పరిష్కరించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సుధారాణి, సీఐటీయు నగర అధ్యక్షులు జగన్మోహన్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం అర్బన్ ఆశావర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, కోలకొత్తా మెడికల్ కళాశాల విద్యార్థిని అత్యాచారం, హత్యకు నిరసనగా వచ్చే నెల 3న ఆశా డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన విరామంలో నల్లరిబ్బన్‌లతో నిరసన వ్యక్తం చేయాలని అన్నారు. పనిభారం తగ్గించాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీఓలు ఇవ్వాలని డిమాండ్ చేశారు., ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అప్పయ్యమ్మ, కనకమహాలక్ష్మీ, వసంత, రేవతి, సోమేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా మహిళా సంరక్షణ పోలీసుల బదిలీలు

విజయనగరం క్రైం: జిల్లాలో వివిధ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సంరక్షణ పోలీసులకు ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సిలింగు నిర్వహించి, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా బదిలీల ప్రక్రియ నిర్వహించారు. కౌన్సిలింగు నిర్వహించి, వారు కోరుకున్న చోటికి బదిలీలు చేస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు. వారి వ్యక్తిగత, కుటుంబ, ఆరోగ్య సమస్యలను భాగస్వామ్య ఉద్యోగాలను దృష్టిలో వుంచుకుని ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తూ, బదిలీలు చేపట్టారు. ఖాళీల వివరాలను స్క్రీన్‌పై చూపుతూ, బదిలీలు చేశారు. ఈ బదిలీలపై మహిళా సంరక్షణ పోలీసుల్లో హర్షం వ్యక్తమైంది. ఏఎస్పీ అస్మాపరహీన్, సీఐలు విజయనాధ్, లీలారావు, కార్యాలయ పర్యవేక్షకులు వెంకటలక్ష్మీ, సీనియర్ సహాయకులు తేజ, ఐటీ కోర్ టీం ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

నాగావళికి జలకళ

రేగిడి: ఎగువన పడిన వర్షాలతో నాగావళికి జలకళ వచ్చింది. శుక్రవారం నదీ ప్రవాహం అధికంగా ఉంది. నదిలో గుర్రపు డెక్క ఉండడంతో పచ్చగా కనిపిస్తోంది. లోతట్టు ప్రాంతాల వారిని స్థానిక రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.


సంకిలి వద్ద నాగావళిలో జలకళ

ఆశావర్కర్ల సమస్యను పరిష్కరించాలి

విజయనగరం దాసన్నపేట: ఆశా వర్కర్ల సమస్యను పరిష్కరించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సుధారాణి, సీఐటీయు నగర అధ్యక్షులు జగన్మోహన్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం అర్బన్ ఆశావర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, కోలకొత్తా మెడికల్ కళాశాల విద్యార్థిని అత్యాచారం, హత్యకు నిరసనగా వచ్చే నెల 3న ఆశా డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన విరామంలో నల్లరిబ్బన్‌లతో నిరసన వ్యక్తం చేయాలని అన్నారు. పనిభారం తగ్గించాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీఓలు ఇవ్వాలని డిమాండ్ చేశారు., ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అప్పయ్యమ్మ, కనకమహాలక్ష్మీ, వసంత, రేవతి, సోమేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై వ్యాసరచన పోటీలు

రాజాం: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అప్తాలమిక్ అధికారి సప్పటి వసంతరావు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళావతి, కరస్పాండెంట్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులను పాటించాలి

రాజాం: రైతులు సేంద్రియ పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామారావు సూచించారు. శుక్రవారం బొద్దాం గ్రామంలో పంటలను పరిశీలించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ కె.చంద్రరావు. ఏవో ఎం. రేణుకా సాయి. ఏఈఓలు, ఏఏలు తదితరులు పాల్గొన్నారు

ఖండ్యాం లైన్‌మేన్‌కి కార్యవర్గంలో చోటు

రేగిడి: ఖండ్యాం విద్యుత్ లైన్‌మేన్ కె.శ్రీరాములు నాయుడుకి జిల్లా తెలుగునాడు విద్యుత్ ఉద్యోగుల సంఘ కార్యవర్గంలో చోటుదక్కింది. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఎన్నికల్లో డివిజన్ కార్యదర్శిగా ఎంపికైనట్లు తెలిపారు. శ్రీరాములు నాయుడుని స్థానిక ఏఈ హరిబాబు తదితరులు అభినందించారు.

పౌర హక్కులకు భంగం కలిగితే చర్యలు

రేగిడి: పౌర హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని తహసీల్దార్ ఎల్లారావు, ఈవోఆర్డీ సత్యనారాయణ తెలిపారు. ఉంగరాడ గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజారావు, సర్పంచ్ ప్రతినిధి చల్ల భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి

బాడంగి: సకాలంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.సుధాకర్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తూకంలో తేడాలు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీలు, డీలర్లు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ దుకాణం

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో శుక్రవారం ముగడ గ్రామానికి చెందిన మర్రాపు గౌరమ్మ ఏర్పరిచిన ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తుల విక్రయ దుకాణాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ రసాయన ఎరువులు వినియోగించే ఉత్పత్తులతో పోలిస్తే సేంద్రీయ ఉత్పత్తులు మరింత బలమైనవని, రుచికరమైనవని, ఆరోగ్యానికి మంచివని సూచించారు.

గ్రానైట్ పలకలు పడి యువకుడి మృతి


శశికుమార్ (ఫైల్)

రాజాం రూరల్: గ్రానైట్ పలకలు పడి యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి రాజాం టౌన్ సి.ఐ. కె.అశోక్ కుమార్ అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటకు చెందిన నందమూడి శశికుమార్(24) మరో నలుగురితో కలిసి చీపురుపల్లి రోడ్‌లోని ఓ గ్రానైట్ షాపునకు వెళ్లాడు. కొండంపేటలో తమ బంధువులు నిర్మిస్తున్న ఇంటి కోసం గ్రానైట్ పలకలు కొన్నాడు. శుక్రవారం సాయంత్రం మినీ వ్యాన్‌పై ఈ గ్రానైట్ పలకలను ఎక్కించుకుని వాటిని తాళ్లతో కట్టారు. అనంతరం వ్యాన్‌లోకి ఎక్కి పలకలను పట్టుకు నిల్చుని కొండంపేటకు వెళ్తున్నారు. పట్టణంలోని ఎర్రచెరువు సమీపానికి వాహనం వచ్చేసరికి గ్రానైట్ పలకలకు కట్టిన తాళ్లు తెగిపోయాయి. దీంతో గ్రానైట్ పలకలను పట్టుకుని నిల్చుని ఉన్న శశికుమార్‌పై పలకలు విరిగి పడిపోయాడు. ఘటనలో తలకు తీవ్ర గాయమవడంతో శశికుమార్‌ను రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే శశికుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఏడాదిన్నర క్రితమే వివాహం అయిన మృతుడికి భార్య చందుతో పాటు ఏడునెలల పాప ఉన్నారు. ఇదే ప్రమాదంలో వాహనంపై ఉన్న మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరంతా రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందారు. శశికుమార్ మృతి చెందడంతో కొండంపేట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడి తండ్రి శంకర్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సి.ఐ. అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీపురుపల్లిలో గుర్తు తెలియని మృతదేహం

చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలోని సమీకృత వసతి గృహానికి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం గుర్తించారు. స్థానిక వీఆర్వో సమాచారం మేరకు చీపురుపల్లి సీఐ జి. శంకరరావు, ఎస్సై కె. కిరణ్‌కుమార్‌నాయుడు ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుని వయసు 35 నుంచి 40 సంవత్సరాలమధ్య ఉంటుందని, ఒంటిపై చారల టీషర్టు, నీలి రంగు జీన్స్ ఫ్యాంట్ ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతదేహం తల మొండెం నుంచి వేరు పడి ఉందని, చేతులు పూర్తిగా తెగిపోగా, పాదాలు ఛిద్రమై ఉన్నాయని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాయం కోరితే... డబ్బు కాజేశారు!

గజపతినగరం: బ్యాంకు ఖాతాలో ఎంత మొత్తం ఉందో తెలుసుకునేందుకు పక్కనున్న వారి సాయం కోరితే నగదును కాజేసిన సంఘటన శుక్రవారం గజపతినగరంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. గజపతినగరం దిగువ వీధికి చెందిన సనపతి ప్రసాద్ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో బ్యాంక్‌లో రూ.40వేల నగదు డిపాజిట్ చేశారు. అనంతరం పక్కనే గల ఏటీఎం వద్దకు వెళ్లి నగదు ఎంత ఉందో తెలుసుకోవడంతో పాటు ఏటీఎం కార్డు పిన్ మార్చుకోవాలని ప్రయత్నించారు. తికమక పడిన ప్రసాద్ అక్కడే ఉన్న ఇద్దరు యువకుల సాయం కోరారు. వారు బాధితుడి వద్దగల పాత పిన్ కోడ్ నెంబర్ తెలుసుకొని నకిలీ ఏటీఎం కార్డును ఇచ్చి పరారయ్యారు. వివరాలు తెలియకపోవడంతో బాధితుడు బ్యాంక్ అధికారులను సంప్రదించగా.. రామభద్రపురంలోగల ఏటీఎంలో రూ.40వేల నగదు తీసినట్లు గుర్తించారు. దీంతో అయన పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

శృంగవరపుకోట రూరల్: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఎస్‌కోటలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి సీఐ వీఎస్ మూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన శృంగవరపుకోట మునసబువీధికి చెందిన సోమాదుల రమణ(48) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వరలక్ష్మి పూజలకు కలువపువ్వులు అమ్మేందుకు సిద్ధపడి గురువారం సాయంత్రం తమ వీధి సమీపంలో ఉన్న జగన్నాధసాగర్‌కు చేరుకున్నాడు. ఆ చెరువులో పూవ్వులు కోసేందుకు దిగి ప్రమాదవ శాత్తు మునిగిపోయాడు. రాత్రి అయినా రమణ ఇంటికి చేరకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. శుక్రవారం ఉదయం చెరువు వద్ద బట్టలు కనిపించడంతో చెరువులోకి దిగి వెతకగా మృతదేహం దొరికిందన్నారు. మృతుడి సోదరుడు సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇంటర్ విద్యార్థినికి అస్వస్థత

మెంటాడ: పెదమేడపల్లి మోడల్ స్కూల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థిని నర్మద అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం అనంతరం వాంతులతో పాటు ఫిట్స్ రావడంతో పాఠశాల సిబ్బంది చల్లపేట పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యానికి విద్యార్థిని సహకరించకపోవడంతో రిఫర్ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యులు జిలానీ బాషా చెప్పారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

ఎరువుల కొరత నివారణకు చర్యలు

రామభద్రపురం: ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. బూసాయవలసలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు సిద్ధంగా ఉంచుతున్నామని తెలిపారు. మండలంలోని సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంచాయతీల్లో విద్య, వైద్యం అందించడానికి ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, టీడీపీ నాయకులు దేవర తిరుపతిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాజా భోజనం అందించాలి

రామభద్రపురం: వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు వేడి భోజనం అందించాలని మండల విద్యాశాఖాధికారి-2 పెంటయ్య సూచించారు. నేరెళ్లవలస యూపీ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఆహారం విషయంలో నిర్వాహకులు రాజీ పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అలవెన్స్‌లు చెల్లించకపోతే ఉద్యమం

ఏపీఎస్ ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు నైట్‌హాల్ట్ అలవెన్స్‌లు చెల్లించకపోతే ఉద్యమం తప్పదని ఎన్ఎంయూ, ఆర్టీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల పట్ల ఖజానా శాఖ ఉన్నతాధికారుల వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆయా డిపోల వద్ద ఆందోళన చేపట్టారు. డ్రైవర్లు, కండక్టర్ల నైట్‌అవుట్ అలవెన్సులు పునరుద్ధరించకపోవడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెం.114లో ఉన్న అలవెన్సులు ఇప్పించాలని కోరారు. రిటైర్డ్ పీటీడీ ఉద్యోగులకు గ్రాడ్యూటీ, అర్జిత సెలవుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు, నాయకులు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.


పార్వతీపురంటౌన్‌లో..



పాలకొండలో..


సాలూరు రూరల్..


విజయనగరంలో..

పర్యావరణాన్ని కాపాడుకుందాం

● జిల్లా వ్యాప్తంగా 'వన మహోత్సవం'

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. ఈసందర్భంగా నాయకులు, ఉపాధ్యాయులు, అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం: మొక్కకు నీరుపోస్తున్న ఎమ్మెల్యే అదితి



భోగాపురం: సుందరపేటలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే నాగమాధవి, టీడీపీ నేత బంగార్రాజు



బొబ్బిలిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బేబీనాయన



ఎల్‌కోటలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే లలితకుమారి



విజయనగరం: ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ సేతు మాధవన్



చీపురుపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



రాజాం/రూరల్: సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు



గుర్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు



విజయనగరం: జేఎన్‌టీయూలో..



గరివిడి: మొక్కలు నాటుతున్నచీపురుపల్లి ఆర్డీవో శాంతి

గణేష్ ఉత్సవాల అనుమతులు సులభతరం

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం: వినాయక ఉత్సవాలకు అన్ని రకాల అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్‌విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి సులభతరం చేసిందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. సింగిల్‌విండో విధానంతో గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి మీసేవలో చలానా రుసుం చెల్లించి, నిరంభ్యంతర పత్రం పొందవచ్చునని తెలిపారు. ఈ అనుమతులు తీసుకున్నవారు తనిఖీలకు వచ్చే అధికారులకు పందిరిలో అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు.

సింగిల్ విండో పద్ధతిలో..

బొబ్బిలి: వచ్చే నెల 7 నుంచి వాడవాడలా నిర్వహించే వినాయక ఉత్సవాల కోసం నిర్వాహకులకు ఆన్‌లైన్‌లో సింగిల్ విండో పద్ధతిలో అనుమతి మంజూరు చేస్తామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. గతంలో మాదిరిగా అన్ని శాఖల కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేదన్నారు. మొదటి రోజు ప్రారంభం నుంచి అనుపోత్సవంలో ర్యాలీలు, నిమజ్జనం తదితర అంశాలలో తమ సూచనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. అశ్లీలతకు తావులేకుండా, డీజేలు వంటివి వినియోగించకుండా ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు



సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం విజయనగరంలోని తన కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అధికారులు, సిబ్బంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు నిలిపివేయాలని కోరుతూ సిబ్బంది వినతులు ఇచ్చారని చెప్పారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు విజయనాథ్, ఏవీ లీలారావు పాల్గొన్నారు.

గంజాయిపై ప్రత్యేక నిఘా

రామభద్రపురం: బొబ్బిలి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో గంజాయిని నిరోధించడానికి పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్టు డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయి నిర్మూలనే ధ్యేయంగా పాత బొబ్బిలి, కొట్టక్కి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. యువత గంజాయి విక్రయించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. సైబర్ క్రైం, రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ● వినాయక చవితి ఉత్సవాలకు మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. రాత్రి పూట ఆసుపత్రుల వద్ద పోలీసులు గస్తీ తిరగనున్నారని తెలిపారు. లైసెన్సు లేకుండా మందుగుండు సామగ్రి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ వి.ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి చెప్పినా పరిష్కరించలేదు

● నీటి సమస్యపై లొట్లపల్లి వాసుల ఆవేదన



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న లొట్లపల్లి వాసులు

జామి: లొట్లపల్లి గ్రామంలో గడిచిన ఐదేళ్లుగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని... సాక్షాత్తూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు చెప్పి రెండు నెలలు గడిచినా పరిష్కారం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శుక్రవారం మరోసారి ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఝాన్సీకి గ్రామస్థులు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ రెండు నెలల క్రితం మంత్రి తమ గ్రామం వచ్చినప్పుడు మంచినీటి సమస్య కోసం చెప్పామన్నారు. దీన్ని పరిష్కరించాలని ఆయన సంబంధితఅధికారులను ఆదేశించారని తెలిపారు. లక్ష్మీపురం రక్షిత నీటి పథకం నుంచి పైప్‌లైన్ వేసి సమస్య తీరుస్తామని చెప్పారన్నారు. కానీ ఇంతవరకు పరిష్కరించలేదని వాపోయారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కవిత మాట్లాడుతూ వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

గుళ్లపాడు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

రేగిడి: గుళ్లపాడు ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు, కొంతమందిని ఉపాధికి దూరం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో శ్యామలా కుమారితో పాటు డ్వామా అధికారులకు ఫిర్యాదులు అందించినట్లు యూత్ ప్రతినిధి మంజేటి జగన్మోహనరావు, జి.శివ తదితరులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి దాదాపు 13 మందికి జాబ్‌కార్డులు ఇవ్వకుండా పనికి దూరం చేశారని ఆరోపించారు. మరికొంతమంది పనికి వెళ్లకపోయినా తప్పుడు మస్తర్లతో ఉపాధి నిధులు స్వాహా చేస్తున్నట్లు ఫిర్యాదులు అందించారు.

పింఛన్లలో అక్రమాలపై విచారణ

● ఎవరూ హాజరు కాని వైనం

వంగర: గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు అధికారులను తప్పుదోవ పట్టించి.. శివ్వాంలో అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి మోహనరావు, నాయకులు మురళీకృష్ణ, వెంకటనాయుడు తదితరులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ త్రినాథ్, కిషోర్‌లు శుక్రవారం ఆ గ్రామానికి చేరుకున్నారు. లబ్ధిదారులకు కబురు పెట్టారు. సర్పంచ్ వెంకట అప్పలనాయుడు దీనిని అడ్డుకున్నారు. గ్రామంలో ఎవరూ విచారణకు హాజరు కావద్దని సూచించారు. గ్రామ ప్రధాన వీధిలో బైఠాయించారు. 'ఎమ్మెల్యే గారూ.. న్యాయం చేయాల'ంటూ నినాదాలు చేశారు. విచారణ అధికారులు సాయంత్రం వరకు ఎదురు చూసినా ఎవరూ హాజరుకాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు తెలిపారు.

రైసు మిల్లు కార్మికులకు న్యాయం చేయాలి

రాజాం రూరల్: రాజాం ప్రాంతంలో తీవ్రంగా నష్టపోతున్న రైస్‌మిల్లు కార్మికులకు యాజమాన్యాలతో పాటు ప్రభుత్వం ఆదుకోవాలని సిటు జిల్లా అధ్యక్షులు శంకరరావు డిమాండ్ చేశారు. డోలపేటలోని డొంకల మిల్లు కార్మికులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లేదని, పి.ఎఫ్. కట్ చేసినా పింఛను అందడం లేదని స్పష్టం చేశారు. బియ్యం బస్తాలు 50 కిలోలకు మించి బరువు ఉండకూడదని నిబంధన ఉన్నప్పటికీ 100 కిలోల వరకు ఉంటున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో సిటు జిల్లా ఉపాధ్యక్షులు విశ్వనాథం, కార్యదర్శి కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

డెంకాడ: జిల్లాలోని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘ సాధారణ కార్యదర్శి అల్లి చిన్న మారయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమానికి బేతనాపల్లి వచ్చిన ఎమ్మెల్యే లోకం నాగమాధవికి వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు మచ్చ రాంబాబు, డి.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి

పూసపాటిరేగ: రైతులు వరి పంట సాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్త తేజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రెల్లివలస గ్రామంలో రైతుసేవా కేంద్రం ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. వరిలో కాలిబాటలు ఎంతో అవసరమని తెలిపారు. ఇదే విధమైన కార్యక్రమాలు 14వారాలపాటు పంటకోత సమయం వరకూ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి కె.నీలిమ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పైపులైనుకు మరమ్మతులు

బొబ్బిలి: బలిజిపేట రోడ్డులోని మల్లమ్మదేవి పార్కు సమీపంలో పైపులైను లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. దీనిపై మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే బేబీనాయన అప్రమత్తం చేయడంతో శుక్రవారం నుంచి మరమ్మతులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే బేబీనాయన, మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు, కమిషనర్ రామలక్ష్మి పనులను పరిశీలించారు.

కంచేరుపాలెంలో భూముల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యకళ

భోగాపురం: కంచేరుపాలెంలో భూములకు సంబంధించి సీఎంవో గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై ఆర్డీవో సూర్యకళ స్పందించారు. శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించారు. కంచేరు రెవెన్యూలోని కంచేరుపాలెం గ్రామంలో సర్వే నెం1లో పచ్చికబయలుగా ఉన్న సుమారు 90 ఎకరాల స్థలాన్ని ఎయిర్‌పోర్టు ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే కొంతమంది రైతులు ఆ భూమి తమ అనుభవంలో ఉందని, దానికి సంబంధించి పరిహారం మంజూరు చేయాలంటూ ఇటీవల సీఎంవో గ్రీవెన్స్‌కు వెళ్లారు. ఈనేపథ్యంలో ఆర్డీవో.. ఆ భూములను పరిశీలించి, సంబంధిత రైతులను విచారించి, వివరాలు నమోదు చేసుకున్నారు. రికార్డులు పరిశీలించి, పూర్తి వివరాలను పైఅధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్, ఆర్ఐ కిషోర్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

మెంటాడ: గిరి ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తామని నాబార్డు డీడీఎం టి.నాగార్జున తెలిపారు. కొండపర్తి, సారాడవలస, ఆంద్ర, లోతుగెడ్డ గ్రామాల్లో నాబార్డు సహకారంతో సాగవుతున్న ఉద్యాన పంటలను నాగార్జున శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెంటాడ మండలంలో తొలివిడతలో 50 మందికి 75 చొప్పున మామిడి, సీతాఫలం మొక్కలను పంపిణీ చేశామని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో 300 మంది రైతులను ఎంపిక చేయాలన్న లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. కొండ ప్రాంతాల్లో సాగు నీటి సమస్య తలెత్తుతోందని గిరిజనులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నీటి కుంటలను ఏర్పాటు చేయాలని కోరారు ఉన్నతాధికారులతో చర్చిస్తామని డీడీఎం నాగార్జున హామీ ఇచ్చారు. లబ్ధిదారులకు క్రిమి సంహారక మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ సర్పంచ్ భీమారావు, మాజీ ఉపసర్పంచ్ పైడితల్లి, బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుమన్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

భోగాపురం: పెదహరిజన వీధి అభివృద్ధికి సహకరించాలని ఆ వీధివాసులు స్థానిక తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీవో అప్పలనాయుడుకు కోరారు. శుక్రవారం స్థానిక పెదహరిజన వీధిలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పౌరహక్కులపై అవగాహన కలిగిఉండాలన్నారు. హరిజనవీధిలో ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసురావాలని తెలిపారు. దీనిపై స్థానికులు మాట్లాడుతూ శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊడికల అప్పయ్యమ్మ, ఆర్ఐ కిషోర్, కార్యదర్శి సురేష్, వీఆర్వో రామ్‌నాయుడు, స్థానికులు పచ్చిపాల గురునాథరావు, ఊడికల గురువులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

విజయనగరం రింగురోడ్డు: ప్రబోధాసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక విజయనగరం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణజన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. గురజాడ కళాభారతిలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ముగింపులో భాగంగా ఈ శోభయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొని, కృష్ణుడి విగ్రహంతో వున్న పల్లకీని మోశారు. కొంత దూరం నడిచారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, అవనాపు విజయ్, జనసేన నాయకుడు గురాన అయ్యలుతో పాటు సమితి సభ్యులు సీవీఎస్ నాయుడు, ఆదినారాయణ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగు పరచండి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో రాణి



స్థానికులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రాణి

నెల్లిమర్ల: పారిశుధ్యం మెరుగ్గా ఉంటే రోగాలను దూరం చేయవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.రాణి అన్నారు. మండలంలోని కొండవెలగాడ గ్రామాన్ని ఆమె శుక్రవారం పర్యటించారు. గ్రామంలో నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమంపై ఆరా తీశారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి రమణతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ, పీహెచ్‌సీ హెడ్ నర్స్ రూతమ్మ, ఏఎన్ఎం ఎ.మాధవి పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనంలో నాణ్యతా లోపం

గంట్యాడ: రామవరం జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో శుక్రవారం నాణ్యత లోపించింది. విద్యార్థులకు అందించిన అన్నం పూర్తిగా ఉడకపోవడంతో వారు తినలేకపోయారు. దీంతో బయట పడేయాల్సి వచ్చింది. దీంతో నిర్వాహకులు విద్యార్థులకు ఉప్మా తయారు చేసి పెట్టారు. దీనిపై హెచ్ఎం యశోద వద్ద ప్రస్తావించగా ఇటీవల వర్షాల కారణంగా కట్టెలు తడిచిపోవడంతో బియ్యం పూర్తిగా ఉడకలేదని తెలిపారు. అటువంటి అన్నం పెడితే విద్యార్థులకు కడుపునొప్పి వస్తుందనే ఆలోచనతో వారికి ఉప్మా తయారుచేసి పెట్టించామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి పూజలు

శ్రావణ నాలుగో శుక్రవారం సందర్భంగా జిల్లాలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. గృహాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు.



రాజాం రూరల్: నవదుర్గ ఆలయంలో



జామి: కుమారాం ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో..



శృంగవరపుకోట రూరల్: బొడ్డవరలో సామాలమ్మకు శ్రావణ సారె సమర్పణ



కొత్తవలస: కుంకుమ పూజలు



బొబ్బిలి: కళింగ వైశ్య భవనంలో

విద్యార్థుల సమస్యకు పరిష్కారం

గరివిడి: మెరకముడిదాం మండల విద్యార్థుల సమస్యను టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పరిష్కరించారు. మండలానికి చెందిన వందలాది మంది విద్యార్థులు చీపురుపల్లి, గరివిడి పట్టణాల్లోని కళాశాలలో చదువుతున్నారు. అయితే వీరు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెరకముడిదాం మండల కేంద్రం నుంచి గర్భాం మీదుగా చీపురుపల్లికి గతంలో రెండు ఆర్టీసీ బస్సులు ఉండేవి. ప్రస్తుతం ఒక బస్సు మాత్రమే నడుస్తోంది. దీంతో విద్యార్థులు కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈక్రమంలో తమకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ రెండు రోజుల కిందట గర్భాం గ్రామంలో విద్యార్థులు నిరసన తెలిపారు. అనంతరం రామ్‌మల్లిక్‌నాయుడుకు సమస్యను వివరించారు. ఈ సమస్యపై స్పందించిన ఆయన.. ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి, మెరముడిదాం మండల కేంద్రం నుంచి చీపురుపల్లికి వెళ్లేలా బస్సు సౌకర్యం కల్పించారు. దీనిపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

బాలుర వసతి గృహం సందర్శన

గుర్ల: కలవచర్ల ఉన్నత పాఠశాలను, బాలుర వసతి గృహాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం సందర్శించారు. వసతి గృహంలో స్నానపు గదులు, మరుగుదొడ్లు, నీటి సరఫరా విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో వీటిని అందుబాటులోకి తీసుకు రావాలని సంక్షేమాధికారికి, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి యాళ్ల నాగరాజు, చైల్డ్‌లైన్ సిబ్బంది మీనాకుమారి పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోగల కేజీబీవీ పాఠశాలలో కేసలి అప్పారావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పిసిని నారాయణరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర, ప్రిన్సిపాల్ జానకి తదితరులు పాల్గొన్నారు.